జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 129 | గురువారం 2 అక్టోబరు– 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from : Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

## 15 ఏళ్ల నాటి కల సాకారం.. సీఎం గ్రీన్‌సిగ్నల్



(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగ ఉద్యోగుల చిరకాల స్వప్నం నిజమైంది. దాదాపు 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మూడు వేతన సవరణ కమిషన్ల బకాయిలను అమలు చేస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర చర్య పట్ల తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య ప్రభుత్వ ఉన్నతాధికారులకు, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

మూడు పీఆర్సీల అమలుతో భారీ ఊరట..

వికలాంగ ఉద్యోగులకు సంబంధించి 2010, 2015, మరియు 2020 పీఆర్సీలను ప్రభుత్వం ఆమోదించి.. వాటిని తక్షణమే అమలు చేసింది. ఈ నిర్ణయం ఫలితంగా.. సవరించిన జీతాలు మంగళవారం రోజున ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ పెరుగుదల వల్ల ప్రతి ఉద్యోగికి సగటున రూ. 55,000కు మించి జీతంలో పెంపుదల లభించినట్లు వీరయ్య తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఈ ఉద్యోగులు తమ పీఆర్సీ అమలు కోసం చేసిన ప్రయత్నాలను అంతకుముందు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదని.. దీనివల్ల వారు నిరాశకు గురయ్యారని ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ నిరాశను తొలగిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి దీర్ఘకాల డిమాండ్‌ను గౌరవించడం అభినందనీయం అన్నారు.

దసరా పండుగ వేళ గొప్ప బహుమతి..

ఛైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. 'మూడు పీఆర్సీల ఆమోదానంతరం మేము ఎటువంటి ఆలస్యం చేయకుండా, తక్షణ అమలుకు చర్యలు తీసుకున్నాము. ఉద్యోగులు నిన్న తమ పెరిగిన జీతాలను స్వీకరించారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దసరా పండుగ వేడుకలకు అనుగుణంగా ఉండటం వారికి అద్భుతమైన కానుక' అని అన్నారు. పెరిగిన వేతనాల వల్ల ఉద్యోగులు తమ కుటుంబ ఖర్చులను తీర్చుకోవడానికి.. దసరా సంబరాలను సంతోషంగా జరుపుకోవడానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్లకు వీరయ్య ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా.. పీఆర్సీ బకాయిల చెల్లింపులో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చూపించిన చొరవ, అధికారుల సహకారం ప్రశంసనీయమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం వికలాంగుల సామాజిక వర్గానికి నిజమైన 'సంక్షేమ సర్కారు' అని నిరూపించుకుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ పెంపుదల వారి ఆర్థిక స్థిరత్వం, జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది.ఇదిలా ఉండగా.. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో వికలాంగుల కోసం జరిగిన ఉచిత వీల్‌చైర్ పంపిణీ కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని వికలాంగుల నెట్‌వర్క్, ఫ్రీడమ్ అసోసియేషన్, ట్రిపుల్ ఆర్ ఫౌండేషన్ మరియు ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. ముఖ్య అతిథిగా కమిషనర్ సజ్జనార్ లబ్ధిదారులకు వీల్‌చైర్‌లను పంపిణీ చేశారు.

## జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు: జిల్లా ఎస్పీ



(సందేశం టైమ్స్) :చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటామని కొమురం భీం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మంచి మార్గాన్ని ఎంచుకొని జీవితంలో పైకి ఎదుగుతూ సమాజ బాగు కోసం పాటుపడాలని అన్నారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. చేసే ప్రతి మంచి పనిలో విజయం చేకూరాలని, అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు ముందు ఉంటుందని ఆకాంక్షించారు.


## రేవంత్ సర్కారులో డీఏ అంటే.. డోంట్ ఆస్క్




సిద్దిపేట:(సందేశం టైమ్స్): దసరా సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంచి తీపి కబురు చెబితే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం తమ ఉద్యోగులకు దసరాకు చేదు నింపిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఉద్యోగుల్ని చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ డీఏ ఇచ్చారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఓల్డ్ డీఏ ఇస్తామని, అలాగే ఆరు నెలల్లోగా పీఆర్సీ ఇస్తామన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.

అధికారంలోకి రాగానే ఓల్డ్ పెన్షన్ స్కీమ్..

ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టిన ఘనత దేశంలో ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. నెలకు రూ.750 కోట్ల ఎరియర్స్ క్లియర్ చేస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. పోలీసులకు రావాల్సిన అలవెన్స్ కూడా రావడం లేదని, కనీసం పెట్రోల్ అలవెన్స్ ఇవ్వడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పోలీసులకు కొత్త వెహికిల్స్ ఇచ్చారని గుర్తు చేశారు. రూ.12వేల హోమ్ గార్డ్స్ జీతాన్ని రూ.29 వేలకు కేసీఆర్ పెంచితే, సీఎం రేవంత్ 75 రూపాయలు పెంచారని విమర్శించారు. పోలీసుల సరెండర్ లీవ్స్ బడ్జెట్ కూడా రావడం లేదని పేర్కొన్నారు. ఇప్పుడున్న సీపీఎస్ స్థానంలో తాము అధికారంలోకి రాగానే ఓల్డ్ పెన్షన్ స్కీమ్ తెస్తామని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.



## మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కన్నుమూత

(సందేశం టైమ్స్): అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి (73) కన్నుమూశారు. కాసేపటి క్రితం ఎఐజి ఆస్పత్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. ఎల్లుండి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి లో దామోదర్ రెడ్డి అంత్యక్రియలు జరగనున్నాయి. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, వైయస్ఆర్ మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రిగా దామోదర్ రెడ్డి పనిచేశారు.

## తెలంగాణలో బతుకమ్మ చీరల పంపిణీ ఎప్పుడంటే!

(సందేశం టైమ్స్): కాంగ్రెస్ సర్కార్ స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు రెండేసి చొప్పున బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ చీరల కోసం ఎదురుచూసిన మహిళలకు నిరాశే మిగిలింది. ఈసారి బతుకమ్మ పండుగకు ప్రభుత్వం చీరలు పంపిణీ చేయలేదు. అయితే ఈ చీరలు ఎప్పుడు అందిస్తారని నెట్టింట చర్చ మొదలైంది. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి రోజున చీరలు పంపిణీ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ దసరా శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): : రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యదక్షులను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ధర్మానిదే విజయమనే స్ఫూర్తిని దసరా పండుగ మనకు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, వారి జీవితాల్లో సుఖసంతోషాలు నిండేలా దీవించాలని దుర్గామాతను కేసీఆర్ ప్రార్థించారు.

## మాదంతా ఖాకీ బుక్..
## పింక్ బుక్ తెలీదన్న డీజీపీ



హైదరాబాద్,అక్టోబర్ 1(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డి ఈరోజు (బుధవారం) బాధ్యతలు చేపట్టారు. పండితుల వేద మంత్రాల నడుమ డీజీపీగా శివధర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీజీపీగా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఏ లక్ష్యంతో తనను నియమించారో అందుకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. తన మొదటి ఛాలెంజ్ లోకల్ బాడీ ఎన్నికలని తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు పూర్తి చేయడానికి సన్నద్ధం అవుతున్నామని చెప్పారు. పోలీస్ శాఖలో 17,000 ఖాళీలు ఉన్నాయని.. ఆ నియామకాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. బేసిక్ పోలీసింగ్‌తో సాంకేతికతను ఉపయోగించుకుని మరింత సమర్థవంతంగా పని చేస్తామని డీజీపీ తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న కవిత



(సందేశం టైమ్స్): తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు.బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపెడితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు.ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు.

# స్థానిక సంస్థలకు ఎన్నికల దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రంగం అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పంకజ్ ఐపీఎస్

- తమ ఏరియాలో గల పోలింగ్ స్టేషన్స్, లొకేషన్ లను సందర్శించి, పరిస్థితులను సమీక్షించాలి..
- చెడు నడత గలిగిన, గత ఎన్నికలలో అల్లర్లు సృష్టించిన వారిని బౌండ్ ఓవర్ చేయాలి..
- ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం, డబ్బు మరే ఇతరములు అక్రమ రవాణా జరగడానికి వీలులేదు.
- ఎన్నికల వేల ప్రజలలో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపడంలో పోలీసులు కీలక పాత్ర వహించాలి.
- జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1అక్టోబర్: స్థానిక సంస్థలకు ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఈ రోజు తేది: 01.10.2025 నాడు జిల్లా పోలీసు కార్యాలయం నుండి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ గారు మాట్లాడుతూ.. ఫ్రీ అండ్ ఫేర్ ఎన్నికల నిర్వాహణే లక్ష్యంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా యుతంగా వ్యవహరించాలని అన్నారు. ఎస్.హెచ్.ఓ లు, తమ ఏరియాలో గల అన్ని పోలింగ్ లొకేషన్స్, పోలింగ్ స్టేషన్స్, లను సందర్శించి, పోలింగ్ రోజు ఎలాంటి ఇబ్బందులు తలెటకుండా అన్నిరకాల ఏర్పాట్లను చేయించాలన్నారు. గత ఎన్నికలలో అల్లర్లు సృష్టించిన, వారిని సత్:ప్రవర్తన కోరుతూ ముందస్తు బౌండ్ ఓవర్ చేయాలని, ఎన్నికలను ప్రభావిత చేసే డబ్బు, మద్యం, మరే ఇతరములు అక్రమ రవాణా జరగడానికి విలులేకుండా ఎన్ఫోర్స్మెంట్ డ్యూటీలు నిర్వహించాలని అన్నారు. విలేజ్ పోలీసు అధికారి తమ కేటాయించిన గ్రామలపై పూర్తి అవగాహన కలిగి ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పట్ల సామాన్య ప్రజల్లో నమ్మకం కలిగించడంలో పోలీసులుగా మన భాధ్యత ఎంతగానో ఉందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు శాంతియుతంగా జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, నగదు, మద్యం, యువతకు క్రికెట్ కిట్ లు మొదలగు ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పకడ్బందీగా చేపట్టాలని, ఎవరైనా ఓటర్లను ప్రలోభపెట్టే ఏలాంటి చర్యలకు దిగిన సంబంధిత వ్యక్తులపై యం.సి.సి ఉల్లంగన కేసులు నమోదు చేయాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో అదనపు.ఎస్పీ రఘునందన్ రావ్, ఇన్స్పెక్టర్స్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, రమేష్, తదితరులు ఉన్నారు.

## అంగరంగ వైభవంగా బోరంచలో సద్దుల బతుకమ్మ పండుగ






సందేశంటైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1అక్టోబర్: నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండలం పరిధిలో బోరంచ గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి.గత వారం రోజులుగా బతుకమ్మను రకరకాల పువ్వులతో గుణక పువ్వు,తంగర పువ్వు, బంతిపూలు, చామంతి పూలు, తీరక పూలతో అందంగా అలంకరించిన గునుక పువ్వును రకరకాల రంగులు తో బతుకమ్మను గుమ్మడి ఆకులు పరిచి అనేక రకాల పూలతో అలంకరించి పసుపుతో అందంగా గౌరమ్మను తయారుచేసిన ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు.అనంతరం బతుకమ్మను తీసుకొని ప్రతి ఆడపడుచులు పాటలతో బతుకమ్మ ఆడుతూ పాడుతూ ఆనంద ఉత్సవాలతో గడిపారు. తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ తొమ్మిది రోజు సద్దుల బతుకమ్మ ఆఖరి బతుకమ్మ ప్రత్యేకంగా ఉంటుంది.గ్రామంలో హనుమాన్ మందిరం, వాడవాడలో, బతుకమ్మ పెట్టి ఆడపడుచులు,చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండా ఆడుతూ పాడుతూ బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు.అనంతర గ్రామ శివారులో ఉన్న నదిలో లో బతుకమ్మను నిమజ్జనం చేయడం చేశారు.అనంతరం తెచ్చుకున్న సద్దుల బతుకమ్మ ప్రసాదాలను ప్రతి ఆడపడుచులు ఒకరికొకరు నైవేద్యం సమర్పించుకోని వాను బొట్లు తీసుకొని ఆనందంగా గడిపారు.

## సదాశివపేట చిన్న బసవేశ్వర్ మందిరంలో నవరాత్రుల ప్రత్యేక దుర్గామాత పూజలు



సదాశివపేట పట్టణంలోని చిన్న బసవేశ్వర్ మందిరంలో, శ్రీ మాత్రే అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రుల సందర్భంగా దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి.స్థానికులు హాజరై హారతి కార్యక్రమంలో పాల్గొని, సమాజానికి శాంతి, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంఘసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు ఐక్యంగా ఉండి సంప్రదాయాలను కొనసాగించాలన్న సందేశం ఇచ్చారు.

## నీట్‌లో ప్రథమ ప్రయత్నంలోనే విజయం సాధించిన హాసిని – ప్రభుత్వ మెడికల్ కాలేజీలో MBBS సీటు



సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఎ అక్టోబర్ 1: నారాయణఖేడ్ టౌన్‌కు చెందిన కల్లు గీత కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ శ్రీ జూకంటి శంకర్ గౌడ్ మనుమరాలు హాసిని, ప్రథమ ప్రయత్నంలోనే %చీజుజు% (నీట్) పరీక్షలో ప్రతిభ చూపి ప్రభుత్వ వైద్య కళాశాలలో %వీదీదీూ% సీటు పొందారు.

ఆల్ ఇండియా ర్యాంక్ – 55,155

స్టేట్ ర్యాంక్ – 668

ఈ ర్యాంకుల ద్వారా హాసిని సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు పొందడమే కాకుండా, తన కృషి, పట్టుదలతో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది.

“హాసిని సాధించిన విజయం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆమె నిరంతర అధ్యయనం, సంకల్పమే ఈ ఫలితానికి నాంది పలికాయి,” అని ఉపాధ్యాయులు తెలిపారు.

## విజయదశమి సందర్భంగా నూతన వస్త్రాల పంపిణీ



సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఎ తేదీ: అక్టోబర్ 1: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలానికి చెందిన మర్వెల్లి గ్రామంలో విజయదశమి (దసరా పండుగ) సందర్భంగా మాజీ ఎంపీటీసీ తమ్మన్నగారి సంగన్న ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు నాగ్గల్ల రాజు, సంగయ్య, భూమయ్య, నాగ్గల్ల రాజు తదితరులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు జరుగుతుండటం అభినందనీయమని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డరు



## బహిరన్ దిబ్బ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్



సందేశం టైమ్స్ : నారాయణాఖేడ్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 1:మెదక్ జిల్లా: అల్లాదుర్గం మండలంలో ని బహిరన్ దిబ్బ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించరు.ఈ కార్యక్రమంని హెడ్ కానిస్టేబుల్ జనార్ధర్ ప్రత్యేక పోషించారు. ఐదు గ్రామాల యువకులు తలపడగా బహిరందిబ్బ గ్రామం టీం మొదటి విజేతగ రెండవ విజేత నిలిచారు. విజేతలకు గ్రామ నాయకులు బహుమతులు అందజేశారు. యువత క్రీడారంగంలో ప్రత్యేక పాత్ర పోషించి ముందు ఉండాలని. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం జనార్ధన్ చెప్పుకొచ్చారు. యువత అన్ని రంగాలలో ముందుండాలని కోరారు.

# సంపాదకీయం

## కొత్త రాజకీయ పొద్దుపొడుపు ఎప్పుడు

భారత దేశ రాజకీయాలు సంధి దశలో ఉన్నాయి. అయితే గత కొంతకాలంగా సంభవిస్తున్న పరిణామాలు భావి రాజకీయాల తీరుతెన్నులు మారబోతున్నాయన్న సంకేతాల నిస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్ శిబిరాల్లో కదలికలు అనేక ఊహాగానాలకు దారితీస్తున్నాయి. ఓట్ చోరీ ఆరోపణల తర్వాత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్ప కాంగ్రెస్‌లో మరో నేత కనపడడం లేదు. బీజేపీపై రాహుల్ తదుపరి ఆరోపణలు ఏమి చేయనున్నారన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొని ఉంది. ఓట్ చోరీపై ఇప్పటి వరకూ రెండు సార్లు విలేఖరుల సమావేశం నిర్వహించి, ఆయన వెల్లడించిన అంశాలకు చాలా ప్రచారం లభించింది. రాహుల్ తదుపరి వదిలే హైడ్రోజన్ బాంబు గురించి కూడా ఆసక్తి వ్యక్తమవుతోంది. నిజానికి కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో కంటే పార్టీ అధ్యక్ష పదవిని వదులుకున్న తర్వాతే రాహుల్ గాంధీ చాలా జాగ్రత్తగా తన వ్యక్తిగత ప్రతిష్ఠ పెంచుకుంటూ వస్తున్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయయాత్ర రెండింటిలోనూ మేధావులు, ప్రజల దృష్టిని రాహుల్ విశేషంగా ఆకర్షించారు. డీలాపడ్డ కాంగ్రెస్ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని సమకూర్చారు. రాహుల్ గాంధీ ఏమి చేస్తారన్న దానిపైనే తమ భవిష్యత్ ఆధారపడి ఉందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.భారత్ జోడో యాత్రల తర్వాత సామాజిక న్యాయంపై రాహుల్ దృష్టి సారించారు. శాస్త్రీయమైన కులగణన జరిపి వివిధ సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్న డిమాండ్‌ను లేవనెత్తారు. మరో వైపు భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతోందన్న భావనను కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మోదీ తీసుకుంటున్న అప్రజాస్వామిక నిర్ణయాలను, చేస్తున్న వ్యవస్థల హననాన్ని ఆయన ప్రశ్నిస్తున్నారు. బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' సందర్భంగా రాహుల్ చేసిన విమర్శలు బాగా చర్చనీయాంశమయ్యాయి. నిన్నమొన్నటి దాకా కాంగ్రెస్‌కు వారసత్వమే గుదిబండగా కనిపించేది. అయితే ఇప్పుడు ఆ వారసత్వంపై నేతల ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాది అహ్మదాబాద్ లోనూ, ఈ ఏడాది పాట్నాలోనూ నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల ద్వారా పార్టీకి పూర్వవైభవం తేవాలన్న ఆకాంక్షను పార్టీ కార్యకర్తల్లో రాహుల్ ప్రగాఢంగా రేకెత్తించారు. ఒకప్పుడు గుజరాత్, బిహార్‌లో జరిగిన ప్రజా ఉద్యమాలు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌ను దెబ్బతీసేందుకు కారణమయ్యాయి. 'మోదీ స్వంత రాష్ట్రంలో బీజేపీని ఓడించడం అవసరం' అని గత నెలలో గుజరాత్‌లో రాహుల్ ప్రకటించారు. గుజరాత్, బిహార్, ఒడిషాతో పాటు దేశమంతటా 'సంఘటన్ సృజన్ అభియాన్' పేరిట కాంగ్రెస్‌ను పటిష్టం చేసి, వ్యవస్థీకృత మార్పులు తెచ్చేందుకు రాహుల్ కీలక చర్యలు చేపట్టారు. అనేక రాష్ట్రాల్లో జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి నేతలతో రాహుల్ విడివిడిగా సంభాషిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలకు అభ్యర్థుల ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటామని చెప్పి వారిలో ఉత్సాహం నింపుతున్నారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికలో కూడా తొలిసారి ఏఐసీసీ పరిశీలకులను నియమించడం ఒక కీలక పరిణామం.పాట్నాలో ఒకప్పుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడుగా ఉన్న, మహాత్మాగాంధీ ఎన్నో చరిత్రాత్మక పోరాటాలు ప్రారంభించిన 'సదాకత్ ఆశ్రమ్' నిన్న మొన్నటి వరకు పాడుపడిపోయి ఉండేది. ఇప్పుడు దానికి పూర్వ కళ వచ్చేసింది. ఇటీవల ఏఐసీసీ విస్తృత వర్కింగ్ కమిటీ సమావేశం ఇదే భవనంలో జరపడం కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని కల్పించింది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే రాహుల్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇద్దరూ కలిసి అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం కల్పించే మేనిఫెస్టోను (అతిపిఛ్డా న్యాయ సంకల్ప్) విడుదల చేశారు. ఇటీవల పార్లమెంట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే ప్రతిపక్షాల కార్యాచరణను ప్రధానంగా రాహుల్ గాంధీయే నిర్దేశిస్తున్నారని స్పష్టమవుతోంది. ఆయన లేవనెత్తిన సామాజిక న్యాయ ఎజెండాను ఇతర ప్రతిపక్షాలు కూడా స్వీకరించినట్లు కనపడుతున్నది. ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీయే నిర్ణయించి, మిగతా ప్రతిపక్షాలను తనకు మద్దతుగా సమీకరించగలిగింది. రాహుల్ నిర్వహిస్తున్న సమావేశాలకు ప్రతిపక్ష నేతలు అందరూ హాజరవుతున్నారు. ఈ దేశంలో ప్రత్యామ్నాయ నేత రాహుల్ తప్ప మరొకరు లేరన్న విషయమై ప్రతిపక్షాలు పెద్దగా విభేదించడం లేదు. ఆర్జేడీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.మోదీ ప్రభుత్వంపై రాహుల్ చేస్తున్న పరుష విమర్శలు సోషల్ మీడియాలో కూడా అధిక ప్రాధాన్యం లభిస్తోంది. గతంలో బీజేపీ సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా చాలా ప్రభావశీలమైన ప్రచారం చేసేది. ఇప్పుడు ఆ టెక్నిక్‌ను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కూడా నేర్చుకున్నాయి. రాహుల్‌ను అభిమానించే మీడియా విశ్లేషకుల బృందం ఆయన మాట్లాడిన మాటలకు సోషల్ మీడియాలో ప్రాచుర్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. రాహుల్ మాట్లాడిన వెంటనే ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్ నుంచి ప్రకాశ్‌రాజ్ వరకు అందుకుని ఆయనను సమర్థించడం ఒక పరిణామం. స్పష్టంగా చెప్పాలంటే దేశం ఇప్పుడు రాజకీయంగా, సైద్ధాంతికంగా బీజేపీ, కాంగ్రెస్ శిబిరాల మధ్య విడిపోతోంది. మోదీని వ్యతిరేకించేవారు, ద్వేషించేవారు కాంగ్రెస్ శిబిరంలో అనివార్యంగా చేరిపోతున్నారు. పార్టీలు కూడా అదే విధంగా విడిపోతున్నాయి. 2019లో 52 సీట్లు సాధించిన కాంగ్రెస్, 2024లో 99 సీట్లకు చేరుకుంది. 21.2 శాతం ఓట్లు సాధించి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఏదో ఒక రూపంలో ఉన్నది. హిందీ బెల్ట్‌లోనూ, ఈశాన్యంలోనూ, మధ్య భారతంలోనూ, దక్షిణ భారతావనిలోనూ కాంగ్రెస్ ముద్రలు ఏదో ఒక రకంగా ఉన్నాయి. కాంగ్రెస్ ఎలాగైనా మరో 50 లేదా 60 సీట్లు అదనంగా సాధించగలిగితే 2029లో కాంగ్రెస్ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం నెలకొనడం ఖాయమన్న ఆత్మ విశ్వాసం ఆ పార్టీ నేతల్లో కనపడుతోంది.అయితే కాంగ్రెస్ పుంజుకుంటున్నదన్న వాతావరణం కాంగ్రెస్ నేతల్లో ఏర్పడినంతగా జనంలో ఏర్పడుతున్నదా? ఇప్పటి వరకూ కనపడుతోంది సంకేతపూర్వక మార్పే కానీ అది పార్టీని ఒక ప్రజా ఉద్యమంగా మార్చగలిగిన పరిణామం కాదు. కాంగ్రెస్ పుంజుకోవడం వాపా, బలుపా అన్నది తేలాల్సి ఉన్నది. రాహుల్ వ్యక్తిగత ప్రతిష్ఠ పెరిగి ఉండవచ్చు కాని అంతే వేగంగా సంస్థాగత బలం పటిష్టమైందా? ఇది సహేతుకమైన అనుమానమే! ఎందుకంటే కాంగ్రెస్‌లో పాత కాలం రాజకీయాలు ఇంకా సమసిపోలేదు. పదవులకై అదే కాట్లాట, వృద్ధ నేతలు వైదొలిగి కొత్త వారికి అవకాశం కల్పించే పరిస్థితి పూర్తిగా రాలేదు. రాహుల్ విశ్వసనీయత పెరిగి ఉండవచ్చు కానీ ఇందిరాగాంధీ లాగా ఒక ప్రజాప్రభంజనాన్ని సృష్టించగలిగిన నాయకత్వం కాంగ్రెస్‌కు రాలేదు. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు రాహుల్ యత్నాలకు తోడుగా పార్టీని బలపరిచేందుకు అంతగా కష్టపడడం లేదు. మీడియాను కలిసి రాజకీయ పరిణామాలు విశ్లేషించే మేధావులు ఉండేవారు.

# సగిలేరుకు వరద



### చిన్నగానిపల్లి సమీపంలో రామన్న కతువకు చేరుతున్న వరద నీరు

### నీటి గుండాలతో అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు టౌన్,అక్టోబరు 1 (సందేశం టైమ్స్): గిద్దలూరు పట్టణం మీదుగా వెళ్లే సగిలేరుకు వరద చేరు తోంది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సగిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కొండపేట సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న నీటిగుండాల కారణంగా చిన్నపిల్లలు ఆప్రాంతాలకు వెళ్లవద్దని, ఈతకు వెళ్లేవారు కూడా వెళ్లకుండా పోలీసులను గస్తీ ఏర్పాటు చేశారు. అర్బన్ సీఐ కె.సురేష్ ఇప్పటికే ఒక ప్రకటనలో చిన్నపిల్లలను ఆప్రాంతాలకు పంపకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దలు కూడా ఎవరూ ఈతకు వెళ్లరాదని తెలిపారు. కెఎసపల్లె, దిగువమెట్ట, ఉప్పలపాడు ప్రాంతాలలో కూడా సగిలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ నీటితో భూగర్భజలాలు పెరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు.


రామన్న కతువకు వరద

రాచర్ల : ప్రస్తుతం కురుస్తున్న వ ర్షాల కారణంగా రామన్న కతువకు వర్షపు నీరు భారీగా చేరుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. నల్లమ ల అడవుల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో వర్షపు నీరు రంగనాయక స్వామి దేవస్థానంలోని గుండానికి భారీగా చేరి అదనపు నీరంతా గుండం నుంచి గుండ్లకమ్మ వాగు ద్వారా చిన్నగానిపల్లె గ్రామ సమీపంలోని రామన్న కతువకు చేరుతోంది. వరదనీరు అధికంగా చేరడంతో కతువ నిండి అలుగు పారుతూ వరద నీటితో కళకళలాడుతుంది. వర్షాల ప్రభావంతో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చోళవీడు సమీపంలోని గుండ్లకమ్మ వాగు ద్వారా ప్రవహించే వరద నీరు అక్కపల్లి, తురిమెళ్ల గ్రామాల మీదుగా ప్రవహిస్తూ భారీ స్థాయిలో కంభం చెరువుకు చేరుతుంది.

# పోలవరం నిర్వాసితులకు ఒకే దఫాలో పరిహారమివ్వకపోతే ఎలా

### విడతలవారీ చెల్లింపులతో అసంతృప్తి

### కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆగ్రహం



అమరావతి, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఒకే దఫాలో సహాయ పునరావాస మొత్తాన్ని అందజేయకపోవడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసహనం వ్యక్తం చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ల్యాండ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విభాగం కమిషనర్ శైలేషకుమార్ సింగ్ జాతీయ హోదా ప్రాజెక్టులు నిర్మిస్తున్న రాష్ట్రాలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష జరిపారు. ఆయా ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణ చట్టాన్ని అమలు చేస్తున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లింపులను పరిశీలించారు. మొదటి దశలో భూసేకరణ కోసం రూ.12,832 కోట్లను చెల్లించాల్సి ఉండగా.. రూ.6,609 కోట్లు మాత్రమే ఇవ్వడంపై పెదవివిరిచారు. నిర్మించిన పునరావాస కాలనీల నిర్వహణ జలవనరులశాఖ చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ఒకేదఫాలో సహాయ పునరావాస పరిహారం చెల్లిస్తే.. ప్రభుత్వం తమకు సరైన నష్టపరిహారం ఇచ్చిందన్న సంతోషం వ్యక్తమవుతుందని కేంద్రం అభిప్రాయపడింది. విడతలవారీ చెల్లింపులతో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతుందని పేర్కొంది. నిర్వాసితులకు సహాయ పునరావాసం చెల్లింపులకు అధికప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

# సార్.. రక్షించండంటూ నిజాం వేడుకోలు



అక్టోబరు 1 (సందేశం టైమ్స్):విదేశాలకు వెళ్లితే.. అధిక మొత్తంలో నగదు సంపాదించవచ్చు. దీంతో కుటుంబంలో సమస్యలు తీరిపోతాయని చాలా మంది భావిస్తారు. ఆ క్రమంలో దేశం కానీ దేశం వెళ్లి తీవ్ర కష్టాల పాలవుతారు. అంతేకాకుండా.. విదేశాలకు వెళ్లేందుకు భారీగా అప్పులు సైతం చేస్తారు. అలా విదేశాలకు వెళ్లి అక్కడ పని చేస్తూ.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. తాజాగా అలాంటి పరిస్థితినే సౌదీలో అనంతపురానికి చెందిన నిజాం అనే వ్యక్తి అనుభవిస్తున్నాడు. ఆ క్రమంలో తన యజమాని చిత్రహింసలు పెడుతున్నాడని.. తనను ఎలాగైనా కాపాడాలంటూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను అతడు వేడుకున్నారు.ఈ మేరకు ఒక వీడియో సందేశం ద్వారా తన ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడికి కిడ్నీ సమస్య ఉత్పన్నమైందని చెప్పారు. అతడికి చికిత్స కోసం ర. 12 లక్షలు అవసరమవుతాయని వైద్యులు చెప్పారన్నారు. దీంతో సౌదీకి రెండు నెలల క్రితం ఉపాధి కోసం వెళ్లినట్లు తెలిపారు. అక్కడ తన యజమాని తనతో పని చేయించుకొని నగదు ఇవ్వడం లేదని వాపోయారు. అంతేకాకుండా.. అతడు తనను నిత్యం చిత్రహింసలు పెడుతున్నారంటూ వీడియోలో నిజాం కన్నీటి పర్యంతమయ్యారు. తనను తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేలా చూడాలంటూ ప్రభుత్వాన్ని అతడు వేడుకున్నాడు. అందుకు సంబంధించిన నిజాం వీడియో మీడియా, సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

# 59 లక్షల ప్యాకేజీ



### గూగుల్‌లో జాబ్ కొట్టిన ఏలూరు జిల్లా అమ్మాయి

### ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

### భీమవరంలో బీటెక్ చదువుతుండగానే ఉద్యోగం

ముదినేపల్లి,అక్టోబరు 1 (సందేశం టైమ్స్): గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయి గూగుల్‌లో జాక్‌పాట్ కొట్టింది. ఏలూరు జిల్లాకు చెందిన దేవకోటి రేణుకా గంగ ఆ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఏడాదికి రూ. 59 లక్షల ప్యాకేజీతో మంచి చాన్స్ అందుకుంది. ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన రేణుకా గంగ, బీటెక్ ఐటీ బ్రాంచి నాల్గవ సంవత్సరంలో ఉండగానే ఆఫ్ క్యాంపస్ సెలక్షన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగానికి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో అత్యధిక ప్యాకేజీతో ఎంపికైనట్లు గూగుల్ యాజమాన్యం నుంచి సెలక్షన్ ఆర్డర్ మంగళవారం రేణుకా గంగకు అందింది. ఆమె వడాలిలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివింది. అనంతరం వేలేరు జవహర్ నవోదయ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివి మంచి మార్కులు సాధించింది. ప్రస్తుతం భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆఫ్ క్యాంపస్ ద్వారా ఉద్యోగాల భర్తీకి గూగుల్ సంస్థ చేపట్టిన ఇంటర్వ్యూలకు ఆమె దరఖాస్తు చేసింది. గూగుల్ ప్లే స్టోర్‌పై తనకు అప్పగించిన ప్రాజెక్టు వర్క్‌ను 3 నెలల్లో విజయవంతంగా పూర్తి చేసింది. గంగ తండ్రి సత్యనారాయణ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు.

కలెక్టర్ అవుదామనుకున్నా

సాఫ్ట్‌వేర్ రంగంలో దిగ్గజ సంస్థ గూగుల్‌లో అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యి కలెక్టర్ అవుదామనుకున్నా. ఈలోగా గూగుల్ ఆఫ్ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యాను. సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి ఉద్యోగం అందిపుచ్చుకోవడం సంతోషం కలిగించింది.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి



పత్తికొండ (కర్నూలు)అక్టోబరు 1 (సందేశం టైమ్స్): పత్తికొండలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ఆటోను లారీ ఢకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుగ్గలి మండలం ముకెల గ్రామానికి చెందిన భూమిక (26), నితిక (5) తల్లీకూతుళ్లు. వారిద్దరూ శిరీష (30)తో కలిసి పండుగ సరుకుల కోసం పత్తికొండకు వచ్చారు. పండుగ, సరుకులు తీసుకుని తమ గ్రామమైన ముక్కెళ్ల గ్రామానికి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు. అయితే మార్గం మధ్యలో బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బ్రేకులు ఫెయిలై ఆటోను ఢకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దారుణం.. మైనర్ బాలికపై బాబాయి అత్యాచారం..




అక్టోబరు 1 (సందేశం టైమ్స్):విజయవాడలో దారుణం చోటు చేసుకుంది. అభం, శుభం తెలియని బాలికపై సొంత బాబాయి అత్యాచారానికి పాల్పడ్డాడు. విజయవాడ కు సమీపంలోని ఓ గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఆ బాలిక తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ బాలిక బాబాయి దగ్గర ఉంటోంది.కొన్ని రోజులుగా ఆ బాలిక అనారోగ్యంగా ఉంటోంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. హాస్పిటల్‌లో టెస్ట్ చేసిన వైద్యులు ఆమె గర్భం దాల్చినట్టు తేల్చారు. బాబాయ్ అత్యాచారం చేశాడని బాలిక షాకింగ్ విషయం చెప్పింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు

# ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

**చిత్తూరు' అటవీశాఖ పార్కులో ఒంటరి జంటను బెదిరించి ఘాతుకం**



చిత్తూరు అర్బన్, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఇంటర్ విదార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. దుండగులు ఒంటరిగా ఉన్న జంటను బెదిరించి, అందులో యువతిని చెరబట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాలివీ.. పూతలపట్టు మండలానికి చెందిన బాలిక చిత్తూరులో ఇంటర్మీడియట్ చదువుకుంటోంది. గత గురువారం స్నేహితుడితో కలిసి మురకంబట్టు సమీపంలో అటవీశాఖకు చెందిన 'నీవా నగర వనం' పార్కుకు వెళ్లింది. అక్కడ చిత్తూరుకు చెందిన ముగ్గురు స్నేహితులు హేమంత్, మహేష్, కిశోర్ ఆ ప్రేమజంటను చూసి టార్గెట్ చేశారు. వారి వద్దకు వెళ్లి అటవీశాఖ సిబ్బందిగా పరిచయం చేసుకున్నారు. అనంతరం వారిని ఫొటోలు, వీడియోలు తీసి వారి తల్లిదండ్రులకు పంపిస్తామని బెదిరించి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పగా పార్కు వద్ద ఆ ముగ్గురిలో ఇద్దరికి దేహశుద్ధి చేసి చిత్తూరు తాలుకా పోలీసులకు అప్పగించారు. మరొకడు పరారయ్యాడు. హత్యాయత్నం, పోక్సో, గ్యాంగ్ రేప్‌తో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.


# వర్షాలకు కూలిన రథశాల గోడ



ఎమ్మిగనూరుఅక్టోబరు 1 (సందేశం టైమ్స్): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం రథశాల గోడకూలి ముగ్గురు మృతి చెందారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రథశాల మట్టిగోడలు పూర్తిగా నానిపోయాయి. అర్ధరాత్రి తర్వాత రథశాల మట్టిగోడ కూలి ఓ గుడిసెపై పడి ంది. ఆ గుడిసెలో నిద్రిస్తున్న నాగరాజు (39), ఆయన కుమారుడు లక్ష్మీ నరసింహ(15) అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన నాగరాజు తల్లి లక్ష్మి, సోదరుడు రాజు (32)ల ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజు చనిపోయాడు.

# ప్రత్యేక రైలు వెలవెల

**ఖాళీగా ఉన్న ఏసీ బోగీ**
**అనకాపల్లి నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలులో**
**అంతంత మాత్రంగానే ప్రయాణికులు**
**%ఏసీ బోగీలు పూర్తిగా ఖాళీ**
**ప్రచార లోపంతోపాటు అనకాపల్లి నుంచి**
**నడపడమే కారణమన్న అభిప్రాయం**



అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): దసరా పండుగ రద్దీనిఇ దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సికింద్రాబాద్–అనకాపల్లి మధ్య ప్రవేశ పెట్టిన ప్రత్యేక రైలుకు స్పందని కొరవడింది. 07059 నంబరుతో ప్రతి సాయంత్రం సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం అనకాపల్లికి చేరుతుంది. 07060 నంబరుతో ప్రతి మంగళవారం సాయంత్రం అనకాపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం సికింద్రాబాద్‌కు చేరుతుంది. మంగళవారం ఉదయం 22 బోగీలతో అనకాపల్లి వచ్చిన రైలు, సాయంత్రం 5.35 గంటలకు తిరిగి ఇక్కడి నుంచి బయలుదేరింది. అయితే ఏ బోగీలో కూడా పట్టుమ పది మంది ప్రయాణికులు కూడా లేరు. ఏసీ బోగీలు పూర్తిగా ఖాళీగా కనిపించాయి. సెకండ్ క్లాస్ జనరల్, స్లీపర్ కోచ్‌లలో మాత్రమే విజయవాడ వెళ్లే భవానీ మాలధారులు కనిపించారు. ప్రత్యేక రైలు సర్వీసుపై తగిన ప్రచారం చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పైగా విశాఖపట్నం నుంచి కాకుండా అనకాపల్లి నుంచి నడపడం కూడా ఒక కారణమని అంటున్నారు.

# కిరాణా దుకాణంలో బాణసంచా పేలుడు

**కిరాణా దుకాణంలో బాణసంచా పేలుడు**




అయినవిల్లి, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): కిరాణా షాపులో బాణసంచా సామాగ్రి పేలి భార్యాభర్తలు మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలసకు చెందిన కంచర్ల శ్రీనివాస్(50), భార్య సీతామహలక్ష్మి(48) భార్యభర్తలు. వీరు స్థానికంగా కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. పదేళ్లుగా వీరు తాత్కాలిక లైసెన్సు తీసుకుని దీపావళికి బాణాసంచా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో భార్యభర్తలు వంట గదిలోని అటక మీద గతేడాది మిగిలిన మందుగుండు సామాగ్రిని దింపుతున్నారు. ఈ సమయంలో పేలుడు సంభవించి భారీ శబ్దంతో ఇల్లు కూలిపోయింది. దీంతో ఇద్దరి మృతదేహాలూ శిథిలాల కిందే ఉండిపోయాయి. వారి కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# ఈఎంఐలు చెల్లించలేక ఆత్మహత్య

**అమెజాన్‌లో ఉద్యోగం పోవడంతో ఆర్థిక కష్టాలు**
**మృతుడు సికింద్రాబాద్ వాసి.. ఆకివీడులో ఘటన**



ఆకివీడు,అక్టోబరు 1 (సందేశం టైమ్స్):అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. నెలకు రూ.65 వేల జీతం. హైదరాబాద్, ఏలూరుల్లో ఇళ్లు కొనుగోలు చేశాడు. మూడు నెలల క్రితం ఉద్యోగం పోయింది. నాలుగు నెలలుగా ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఒత్తిడి పెరిగింది. ఫలితంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. సికింద్రాబాద్‌కు చెందిన పాలకుర్తి సంతోష్ కుమార్ చదువుకునే సమయంలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన కీర్తనను ప్రేమించి 2018లో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సంతోష్ హైదరాబాద్‌లో అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. హైదరాబాద్‌లో ఒకటి, ఏలూరులో రెండు ఇళ్లు కొనుగోలు చేశాడు. బ్యాంకులకు నెలకు సుమారు రూ.55 వేలు ఈఎంఐలు చెల్లిస్తున్నాడు. కొంత మొత్తాన్ని ఆయన తండ్రి, మామగారు సర్దేవారు. ఈ క్రమంలో వర్క్ ఫ్రం హోం చేసుకునేందుకు ఇటీవల కుటుంబ సమేతంగా అత్తగారింటికి ఆకివీడు వచ్చాడు. అయితే మూడు నెలలు క్రితం అమెజాన్ నుంచి సంతోష్ కుమార్‌ను తొలగించారు. బ్యాంకులకు ఈఎమ్ఐలు చెల్లించలేకపోవడంతో ఒత్తిడి పెరిగింది. దీంతో తెల్లవారుజామున ఇంటి వరండాలో సంతోష్ కుమార్(35) మెడకు చీర బిగించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయే ముందు సెల్ఫీ సూసైడ్ వీడియోను భార్య ఫోన్‌కు పంపించాడు.

# కళ తప్పిన సూపర్‌బజార్లు

**కొన్ని నెలలుగా మూతపడి ఉన్న కొయ్యూరు జీసీసీ సూపర్‌బజార్**
**నిర్వహణ లేమితో ఒక్కొక్కటిగా మూసివేత**



కొయ్యూరు, అక్టోబరు 1 (సందేశం టైమ్స్):గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఆధ్వర్యంలో నెలకొల్పిన సూపర్‌బజార్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ఒకప్పుడు నిత్యం వాపార కార్యకలాపాలతో దేదీప్యమానంగా వెలుగొందిన సూపర్‌బజార్లు నిర్వహణకు తగిన ఆర్థిక సర్దుబాటు లేక మూసి వేస్తున్నారు.జీసీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీలుగా రెండున్నర దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతీ బ్రాంచీ పరిధిలో గల ప్రధాన సెంటర్లలో రెండు లేదా మూడు సూపర్‌బజార్లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గిరిజనులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటు ధరలకు విక్రయించేవారు. దీంతో పాటు అటవీ ఉత్పత్తుల కొనుగోలు, జీసీసీ ఆధ్వర్యంలో తయారైన తేనె, పసుపు, షీకాయ, సబ్బులు, తదితర వస్తువులు వీటి ద్వారా అమ్మకాలు జరిపేవారు. ఒక్కో బ్రాంచీ పరిధిలో నెలలో లక్షలాది రూపాయల టర్నోవర్ జరిగేది. దీంతో జీసీసీకి లాభాలు బాగానే వచ్చేవి. అయితే గత 10 సంవత్సరాలుగా కొంత మంది సిబ్బంది చేతివాటం వలన ఆదాయం పక్కదారి పట్టింది. కొన్ని బ్రాంచీల్లో తగినంత సిబ్బంది లేక వ్యాపారం తగ్గుముఖం పట్టింది. అమ్మకాలు జరగక సరుకులు కాలం చెల్లిపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడంతో నష్టాల బాట పట్టింది. కృష్ణాదేవిపేటలోని సూపర్‌బజార్‌లో పూర్తి స్థాయిలో నిత్యావసర సరుకులు ఏర్పాటు చేసే ఆర్థిక స్థోమత లేక వెలవెలబోతోంది. ఒకప్పుడు పండుగల సీజన్‌లో సూపర్ బజార్లలో నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు, గృహోపకరణాలు, తదితర సామగ్రి విక్రయించేవారు. ప్రస్తుతం నిత్యావసర సరుకులు సైతం స్టాక్ పెట్టలేని దీన స్థితికి సూపర్‌బజార్లు చేరాయి. వీటి కోసం లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి సూపర్‌బజార్లకు పూర్వవైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

# ఆంధ్రా యువతిపై తమిళ ఖాకీల అత్యాచారం

**ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణం**
**దర్శనానికి వెళ్తున్న అక్కాచెల్లెళ్లను వాహనంలో నుంచి దింపి**
**బైక్‌పై తీసుకెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లు**
**అక్కను బెదిరించి చెల్లెలిపై అత్యాచారం**
**తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ.. నిందితుల అరెస్ట్, రిమాండ్**



చెన్నై, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): ప్రముఖ శైవ క్షేత్రమైన అరుణాచలం(తిరువణ్ణామలై)లో దారుణం చోటుచేసుకుంది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన ఆంధ్రాకు చెందిన ఇద్దరు యువతుల్లో ఒక యువతిపై ఇద్దరు స్థానిక పోలీసులు అత్యాచారానికి తెగబడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తిరువణ్ణామలై బైపాసరోడ్డులో అర్ధరాత్రి దాటాక ఇద్దరు కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో తిరువణ్ణామలై వైపునకు లోడుతో వెళుతున్న ఓ వాహనాన్ని ఆపిన కానిస్టేబుళ్లు.. అందులో ఉన్న ఇద్దరు యువతులను కిందికి దించారు. తెలుగులో మాట్లాడుతున్న వీరు అక్కాచెల్లెళ్లు కాగా, ఒకరికి 20, మరొకరికి 18 ఏళ్ల వయసుంటుందని సమాచారం. ఆ వాహనాన్ని అక్కడి నుంచి పంపించేసిన పోలీసులు తమ ద్విచక్రవాహనాలపై యువతులిద్దరినీ ఎక్కించుకుని సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏందల్ శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అక్కను బెదిరించి పక్కన కూర్చోబెట్టారు. ఆమె చెల్లెలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉదయం రోదిస్తూ కనిపించిన ఆ ఇద్దరు అక్కాచెల్లెళ్లను గమనించిన స్థానికులు తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి పంపించారు. తన చెల్లిపై జరిగిన దారుణం గురించి అక్కడ తిరువణ్ణామలై పోలీసులకు అక్క ఫిర్యాదు చేసింది. ఈ దారుణంపై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. సుందర్, సురేష్‌రాజ్ అనే కానిస్టేబుళ్లను అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు.

# కాలగర్భంలో గ్రామ చావిడి!

**ఒంగోలు గాంధీరోడ్డులో తొలగించిన గ్రామ చావిడి**
**ఒంగోలులోని వీఆర్వోల కార్యాలయం తొలగింపు**



ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): రెవెన్యూ సేవలు అందించడం కోసం ఒంగోలులో తొలిసారిగా నిర్మించిన వీఆర్వోల కార్యాలయం (గ్రామ చావడి) కాలగర్భంలో కలిసిపోయింది. స్థానిక గాంధీరోడ్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో ఉన్న గ్రామచావడి వందేళ్లకు పైగా చరిత్ర కలిగి ఉంది. పూర్వం రెవెన్యూ సేవల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లకుండా ముందుగా వీఆర్వోలను కలిసేందుకు ప్రత్యేకంగా దీనిని ఏర్పాటు చేశారు. బ్రిటీష్ కాలంలో సుమారు 120 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ చావడిలో సుదీర్ఘకాలంగా వీఆర్వోలు సేవలు అందించారు. కాలానుగుణంగా ఆన్‌లైన్ విధానం, ఆ తర్వాత వార్డు సచివాలయాలు అందుబాటులోకి రావడంతో కొన్నేళ్లుగా ఈ కార్యాలయం మూతపడి నిరుపయోగంగా మారింది. రెవెన్యూ అధికారులు దానిని పూర్తిగా తొలగించారు. అందిన సమాచారం మేరకు ఆ స్థలంలో త్వరలో నూతనంగా భవనం నిర్మించి రెవెన్యూ సేవలను పునరుద్ధరించనున్నట్లు సమాచారం.

# శుభ్రపడుతున్న డంపింగ్ యార్డు



అద్దంకి,అక్టోబరు 1 (సందేశం టైమ్స్): అద్దంకి కొండ వద్ద టిడ్కో ఇళ్ల సమీపంలోని డంపింగ్ యార్డు వైపు వెళ్ళాలంటే ఇటీవల వరకు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో టిడ్కో ఇళ్లు పూర్తయినా, అక్కడ నివాసం ఉండేందుకు లబ్ధిదారులు వెనుకడుగు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తీసుకున్న నిర్ణయం తో డంపింగ్ యార్డు స్థానంలో పార్కు అందుబాటులోకి రానుంది. గత దశాబ్ద కాలంగా అద్దంకి పట్టణంలో సేకరించిన చెత్త మొత్తం అద్దంకి కొండకు తూర్పు వైపున సుమారు 4 ఎకరాలు డంపింగ్ యార్డుగా మార్చారు. డంపింగ్ యార్డులో ఉన్న సుమారు 58 వేల మెట్రిక్ టన్నుల చెత్తను చిలకలూరిపేట కు చెందిన తరుణి స్వచ్ఛంద సంస్థ స్క్రీనింగ్ ద్వారా 4 రకాలుగా విభజిస్తోంది. స్క్రీనింగ్ ద్వారా వచ్చే ఘన వ్యర్థాలు, రాళ్లు, అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని గుంతను పూడ్చుతున్నారు. ఎరువును తరుణి స్వచ్ఛంధ సంస్థ రైతులకు అందజేయనుంది.. కాగితాలు, పాత దుస్తులను జిందాల్ సంస్థకు తరలిస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను కాల్చివేయను న్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డు వద్ద ఉన్న వ్యర్థాలు అత్యధిక శాతం తొలగించే విధంగా చేస్తున్నారు. పూర్తి స్థాయిలో తొలగింపు చేపట్టిన తరువాత ఆ ప్రాంతాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేయనున్నారు. సాధారణంగా డంపింగ్ యార్డుగా వినియోగించిన ప్రాంతంలో 15 సంవత్సరాల పాటు ఎలాంటి కట్టడాలు నిర్మాణం చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అద్దంకి కొండ వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతం కొండ ప్రాంతం కావడంతో నేల గట్టితనంగా ఉండే అవకాశం ఉంది. దీంతో కొద్ది సంవత్సరాల తరువాత మున్సిపల్ అవసరాలకు, ఇళ్ల స్థలాల కోసం వినియోగించే అవకాశం ఉంది. దీంతో సుమారు 4 ఎకరాల భూమి మున్సిపాలిటీకి చెందనుంది. అయితే ప్రస్తుతం అద్దంకి పట్టణంలో ప్రతి రోజు 19 టన్నులు చెత్త సేకరణ జరుగుతుండగా 10 టన్నులు మాత్రం ప్రతిరోజు నేరుగా గుంటూరులోని జిందాల్‌కు తరలిస్తున్నారు. మిగిలిన 9 టన్నులలో 1.5 టన్ను వరకు ఎరువుగా మారుతుంది. మిగిలిన చెత్తను ఏవిధంగా వినియోగించాలన్న విషయంపై పై ఉన్నతస్థాయి అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డంపింగ్ యార్డు శుభ్రం అవుతుండటంతో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత లబ్ధిదారులకు దుర్వాసన వచ్చే అవకాశం తప్పింది.

# గోతుల్లో కూరుకుపోయిన వాహనాలు



మాడుగుల రూరల్, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): వడ్డాది-పాడేరు ఆర్అండ్‌బీ రహదారిలో మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్-డి.సురవరం మధ్య రోడ్డుపైన వున్న గుంతల్లో ఉదయం రెండు వాహనాలు, సాయంత్రం ఒక వాహనం దిగబడిపోయాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి సరుగుడు కర్రల లోడుతో ట్రాక్టర్, వడ్డాది వైపు నుంచి నుంచి సరుగుడు కర్రల లోడుతో వ్యాన్ వస్తున్నాయి. డి.సురవరం వద్ద రెండు వాహనాలు ఎదురుపడిన చోట రోడ్డుపై ఉన్న గోతుల్లో కూరుకుపోయాయి. ఇరుక్కుపోయిన వాహనాల యజమానులు ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చి, బయటకు లాగించారు. దీంతో సుమారు గంటసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా సాయంత్రం ఐదు గంటల సమయంలో పాడేరు వెళుతున్న వ్యాన్ డి.సురవరం వద్ద అదే ప్రదేశంలో దిగబడిపోయింది. పక్క నుంచి స్థలం వుండడంతో వాహనాలు అతి కష్టంమీద రాకపోకలు సాగించాయి. ఎక్స్‌కవేటర్‌ను రప్పించి వ్యాన్‌ను బయటకు తీయించారు.

# విద్యుత్ టవరెక్కిన యువకుడు



రేణిగుంట, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): దూకేస్తా.. ఆత్మహత్య చేసుకుంటా.. అంటూ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన కర్ణాటక యువకుడి ఉదంతం విషాదంగా మారింది. రేణిగుంట మండలం గురవరాజపల్లిలో ఈ ఘటన జరిగింది. కర్ణాటక రాష్ట్రం కదూరు ప్రాంతానికి చెందిన శివ(27) ఈనెల 27న శ్రీవారి దర్శనానికి బంధువులు, స్నేహితులతో కలిసి వచ్చారు. తిరుగు ప్రయాణంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటానంటూ వచ్చేశారు. మంగళవారం ఉదయం గురవరాజపల్లిలోని 220 కేవీ విద్యుత్ టవరెక్కిన ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయచంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారించారు. ఇంతలో అతడి సెల్‌ఫోను కింద పడింది. ఇందులోని నెంబర్ల ఆధారంగా కర్ణాటకకు చెందిన శివగా గుర్తించారు. అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఒకవేళ శివ దూకితే రక్షించడానికి వలను సిద్ధం చేశారు. మరోవైపు పోలీసులు టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తే వైరును పట్టుకుని వేలాడుతూ దూకేస్తానంటూ. చివరకు కిందకు దూకగా.. వలలో ఒడిసి పట్టుకునే సమయంలో టవర్ కమ్మీలు శివ తలకు తగలడంతో అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. ఇటీవల అల్లం పంటలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయి మానసికంగా కుంగిపోయినట్లు శివ బావ గిరీష్ తెలిపారు. మద్యం తాగిన సమయంలో రెండుమూడు సార్లు ఆత్మహత్యకు యత్నించగా అడ్డుకోగా.. చివరకు తిరుపతిలో తమనుంచి తప్పించుకుని ఇక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

# ఆ వస్తువులే వారి ఆస్తి



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): ఆచారాలు, సంప్రదాయాలకు నిలయంగా నువ్వలరేవు గ్రామం నిలుస్తోంది. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఇత్తడి, కంచు కుండలు, చెంబులను తమ ఆస్తిగా ఈ గ్రామస్థులు భావిస్తుంటారు. దసరా, సంక్రాంతి లాంటి పెద్దపండుగల సమయంలో ఇళ్లలోని అటుకులు, బల్లలపై ఉన్న ఆ వస్తువులను కిందకు దించుతారు. వీధిలో ఉన్న అమ్మలక్కలను పిలిచి చింతపండు, కర్రల బుగ్గితో కలపి చక్కగా వాటిని తోముతారు. తరువాత పండుగ నాడు వాటిని పూజించి తిరిగి అటుకులపై పేర్చుతారు. తమ పెద్దల నుంచి వచ్చిన ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ గ్రామస్థులు కొనసాగిస్తుండడం విశేషం. పెళ్లిలకు ఆడపిల్లవారు ఇత్తడి, కంచు సామాన్లను తమ శక్తికొలదీ సారెగా ఇస్తుంటారు. భూములు కొనుగోలుపై ఈ గ్రామస్థులు అంతగా ఆసక్తి చూపరు. బంగారం, ఇత్తడి, కంచు సామగ్రిని కొనుగోలు చేయడానికి ఇష్టపడడం వీరి ప్రత్యేకత. దసరా సందర్భంగా ప్రస్తుతం నువ్వలరేవులో ఏ వీధిలో చూసినా ఇత్తడి, కంచు సామాన్లతో పాటు వారిని తోముతున్న మహిళలే కనిపిస్తున్నారు.

# పాముకాటుతో మహిళ మృతి



మునగపాక, అక్టోబరు 1 (సందేశం టైమ్స్): మండల కేంద్రంలో ఒక మహిళ పాముకాటుకు గురై మృతిచెందారు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. మునగపాకకు చెందిన వేగి ఆదిలక్ష్మి (51) సాయంత్రం పొలానికి వెళ్లారు. అక్కడ అరటి తోటలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. కొద్దిసేపటి తరువాత పొలానికి వెళ్లిన పెద్ద కుమారుడు నాగేశ్వరరావు.. అపస్మారకస్థితిలో పడి వున్న తల్లిని చూసి ఆందోళన చెందాడు. నోటి నుంచి నురగ రావడం, కాలిపై పాము కాట్లు కనిపించడంతో వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు చెప్పారు. ఆదిలక్ష్మి భవానీ దీక్షలో ఉన్నారు. జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యురాలిగా వున్న ఆదిలక్ష్మి మృతిచెందడం బాధాకరమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం అన్నారు.

# కుమ్మేసిన నైరుతి



విశాఖపట్నం,అక్టోబరు 1 (సందేశం టైమ్స్):దేశంలో ఈ నైరుతి రుతు పవనాల సీజన్‌లో వర్షాలు అధికంగా కురిశాయి. సాధారణం కంటే 8 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. అక్టోబరు 1 (హేలాపురి న్యూస్):మేఘ విస్పోటనాలు(క్లౌడ్ బర్స్ట్), కొండచరియలు, మట్టిపెళ్లలు విరిగిపడటం వంటి పలు సంఘటనలు జరిగినా ఇది 'చాలా విజయవంతమైన రుతుపవనాల సీజన్' అని ఐఎండీ చీఫ్‌మృత్యుంజయ్ మహాపాత్ర ఆన్‌లైన్ విలేకరుల సమావేశంలో చెప్పారు. జూన్‌లో 8.9%, జూలైలో 4.8%, ఆగస్టులో 5.2%, సెప్టెంబరులో 15.3% అధికంగా వర్షాలు కురిశాయన్నారు. భారతదేశ సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, 937.2 మిల్లీమీటర్ల(8% అధికంగా) వర్షాలు పడ్డాయన్నారు. తూర్పు, ఈశాన్య భారతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యిందని చెప్పారు. సాధారణ వర్షపాతం 1367.3 మిల్లీమీటర్లు కాగా 20 శాతం తక్కువగా 1089.9 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. బిహార్, మేఘాలయ, అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లలో తీవ్ర వర్షాభావం నెలకొందన్నారు. గత 20 ఏళ్లుగా ఆ ప్రాంతంలో వర్షాలు తగ్గుతున్నట్టు తెలిపారు. ఇక వాయవ్య భారతంలో సాధారణం కంటే 27.3 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. వాయవ్య భారతంలోని అన్ని జిల్లాల్లోనూ జూన్, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాధారణం కంటే అధికంగా వర్షాలు

# వంద శాతం పంటల సాగు



అక్టోబరు 1 (సందేశం టైమ్స్)::ఈ వానాకాలంలో పంటల సాగు వంద శాతం పూర్తయింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం 1,32,44,305 ఎకరాలు కాగా... ఇప్పటివరకు 1,33,09,765 ఎకరాల్లో పంటలు సాగుచేసినట్లు వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడించింది. సుమారు 133.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగుచేయటం ద్వారా సాధారణం కంటే 0.5 శాతం విస్తీర్ణం ఈసారి పెరిగింది. ప్రధాన పంటలైన వరి 67.31 లక్షల ఎకరాల్లో, పత్తి 45.95 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 6.45 లక్షలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. మిగిలిన విస్తీర్ణంలో పప్పు ధాన్యాలు, నూనె గింజ లు, ఇతర పంటలు సాగుచేశారు. నిరుడు ఖరీఫలో 129 లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగుచేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇక ఖరీఫ్ కొనుగోళ్ల సీజన్ అక్టోబరు 1 నుంచి ప్రారంభమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ కూడా దేశవ్యాప్తంగా అక్టోబరు నుంచే శ్రీకారం చుడుతుంది. ధాన్యం సేకరించే ఎఫ్‌సీఐ అయినా, పత్తి కొనుగోళ్లు చేసే సీసీఐ అయినా... రాష్ట్రంలో వరి, పత్తి కాకుండా మొక్క జొన్న, జొన్న, సోయాబీన్ లాంటి ఇతర పంటలను కొనుగోలుచేసే మార్క్‌ఫెడ్ కూడా అక్టోబరు నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభిస్తాయి. అయితే నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ముందస్తుగా ధాన్యం వస్తే... కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. ధాన్యం సేకరణకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. అయితే, పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఇంకా స్పష్టత రాలేదు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభం అవుతున్నా.. ఎప్పుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామనే విషయాన్ని సీసీఐ వెల్లడించలేదు. జాబ్ వర్క్ కోసం సీసీఐ పిలిచిన టెండర్లలో కూడా జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లర్లు పాల్గొనలేదు. ఈ అంశంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా దృష్టిసారించారు. పత్తి కొనుగోళ్లపై కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

# 85 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లు స్థానికులకే కేటాయించాలి



అక్టోబరు 1 (సందేశం టైమ్స్):తెలంగాణ ప్రయివేట్ మెడికల్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ కోటా (ఎంక్యూ-1 లేదా బీ కేటగిరి) పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-జూడా) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రయివేట్ మెడికల్ కళాశాలల్లోని 25 శాతం ఎంక్యూ సీట్లు దేశవ్యాప్తంగా అందరికీ ఓపెన్‌గా ఉంచారని, స్థానికుల కోసం ఏ రిజర్వేషన్ లేదని తెలిపింది. ఏపీలో 85 శాతం ఎంక్యూ సీట్లు స్థానికులకు కేటాయిస్తు, కేవలం 15శాతం సీట్లే నాన్ లోకల్ అభ్యర్థులకు కేటాయించారని గుర్తు చేసింది. తక్షణమే ప్రభుత్వ ఉత్తర్వులను సవరించి, ఏపీ మాదిరిగా మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు స్థానికులకే దక్కేలా జీవో ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాలకు లేఖ రాసింది.

# సాధారణం 740 మి.మీ.నైరుతిలోనే 988

హైదరాబాద్/నాగార్జునసాగంఅక్టోబరు 1 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో ఈ ఏడాది నైరుతిలో వానలు దంచికొట్టాయి. నాలుగు నెలల వ్యవధిలోనే ఏడాది సగటు వర్షపాతం కన్నా ఎక్కువగా నమోదైంది. నైరుతి రుతుపవనాల ద్వారా జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాధారణ వర్షపాతం 740.6 మి.మీ.గా వాతావరణశాఖ నిర్ణయించింది. వార్షిక సగటు వర్షపాతం 923.8 మి.మీ. ఉంటుందని తెలిపింది. అయితే నైరుతిలోనే ఏకంగా 988.3 మి.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఇది నైరుతి రుతుపవనాల సగటుతో పోలిస్తే 247.7 మి.మీ అధికం. వార్షిక సగటుతో పోలిస్తే 64.5 మి.మీ అధికంగా నమోదైంది. జూన్ 1న మొదలైన వానాకాలం సీజన్ సెప్టెంబరు 30తో ముగిసింది. నాలుగు నెలల వానాకాలం తర్వాత సాధారణంగా అక్టోబరు 1 నుంచి శీతాకాలం సీజన్ మొదలవుతుంది. కానీ, ఈ నాలుగు నెలల్లో వర్షించి.. ఆ తర్వాత వెనుదిరిగే నైరుతి రుతుపవనాలు మాత్రం ఇంకా నిష్క్రమించలేదు. ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ ప్రారంభమైంది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ దక్షిణాదికి, తెలంగాణకు వచ్చేసరికి మరో 15 రోజులు పట్టే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. బంగాళాఖాతంలో బుధవారం మరో వాయుగుండం ఏర్పడనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అక్టోబరు 2 నాటికి వాయుగుండంగా మారి, 3న తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఇక రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.ఈ ఏడాది వర్షపాతంలోనే కాకుండా.. జలవిద్యుత్ ఉత్పత్తిలోనూ రికార్డులు నమోదవుతున్నాయి. రిజర్వాయర్ల వద్ద ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి పరుగులు పెడుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అత్యధికంగా 2022-23 సంవత్సరంలో రికార్డుస్థాయిలో 6,831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్ ఉత్పత్తి జరగగా.. ఈ ఏడాది (2025-26లో) ఆ రికార్డు బద్దలయ్యే అవకాశాలున్నాయని




అధికారులు అంచనా వేస్తున్నారు. జూలై 29 నుంచి సెప్టెంబరు 29 నాటికి రెండు నెలల వ్యవధిలోనే 4,062 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే ఈ అంచనాలకు కారణం. కేవలం నాగార్జునసాగర్‌లోనే రెండు నెలల్లో 1450 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయ డం గమనార్హం. వాస్తవానికి సాగర్‌లో ఈ ఏడాది మొత్తం 1450 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, కేవలం రెండు నెలల్లోనే (సెప్టెంబరు 30 నాటికే) లక్ష్యాన్ని చేరుకున్నారు. దీంతో అధికారులు, ఇంజనీర్లు మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎగువ నుంచి వరద రాక మరో రెండు నెలలు ఇలాగే కొనసాగితే ఈ ఏడాది 3వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్ తెలిపారు. సాగర్ చరిత్రలో 2019-20 నుంచి ఈ ఏడాది వరకు 2022-23లో ఉత్పత్తి చేసిన 2355.63 మిలియన్ యూనిట్లే అత్యధికం కావడం గమనార్హం.

# 9 నెలల్లో 203 కేసులు.. 189 మంది అరెస్టు !

హైదరాబాద్,అక్టోబరు 1 (సందేశం టైమ్స్): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తెలంగాణలో దూకుడు పెంచారు. ఈ ఏడాది తొలి 9 నెలల్లో 203కి పైగా కేసులు నమోదు చేసి 189 మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులను అరెస్టు చేశారు. ట్రాప్ కేసులు, ఆదాయానికి మించి ఆస్తుల కేసులు, ఆకస్మిక తనిఖీలు, క్రిమినల్ మిస్ కండక్ట్ కేసులు, అంతర్గత విచారణల సందర్భంగా ఈ ఏడాది మొత్తం 203 కేసుల్లో తదుపరి చర్యల నిమిత్తం తుది నివేదికలను ప్రభుత్వానికి పంపించామని ఏసీబీ అధికారులు తెలిపారు. ట్రాప్ కేసుల్లో రూ.42,03,500 స్వాధీనం చేసుకున్నామని,



ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో రూ.58,36,18,724 గుర్తించామని, కేవలం ఇదీ డాక్యుమెంట్ల విలువ మాత్రమేనని, మార్కెట్ విలువ ఈ ఆస్తులది రూ.500 కోట్లు పైన ఉండొచ్చని అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు.

# టాబ్లెట్‌లు వేసుకోలేదని తల్లిని రాడ్డుతో కొట్టి...




హైదరాబాద్: అక్టోబరు 1 (సందేశం టైమ్స్): ప్రస్తుత సమాజంలో మానవతా విలువలకు మనుషులు దూరమవుతున్నారు. మన, తన అనే తేడాలు లేకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. దేని కోసం ఎందు కోసం చేస్తున్నారో తెలియకుండానే.. కన్న వారిని, కట్టుకున్న వారిని కడతేర్చుతున్నారు. తాజాగా.. ఇలాంటి ఘటనే ఒకటి నగరంలో చోటుచేసుకుంది. ఎస్సార్ నగర్‌లో ఓ కసాయి కూతురు కన్నతల్లిని కడతేర్చింది. ఇనుప రాడ్డుతో తల్లిపై అతి కిరాతకంగా దాడి చేసి హతమార్చింది.పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఎస్సార్ నగర్‌లో ఓ కూతురు తన తల్లి టాబ్లెట్‌లు వేసుకోలేదని ఇనుపరాడ్డుతో కొట్టి చంపింది. మృతి చెందిన తల్లి వయసు 90 ఏళ్లు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. హత్య చేసిన నిందితురాలు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు కూతుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# నల్లమలను చూసొద్దాం రండి



మన్ననూర్,అక్టోబరు 1 (సందేశం టైమ్స్): దేశంలోనే రెండో అతి పెద్దదైన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)లో నుంచి టైగర్ సఫారీ పునఃప్రారంభం కానుంది. పెద్ద పులులతో పాటు ఇతర వన్యప్రాణుల సంతానోత్పత్తిని దృష్టిలో ఉంచుకుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు 3 నెలల పాటు నల్లమల అడవిలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించారు. ఈ నిషేధ సమయం ముగియడంతో సఫారీ సేవలు తిరిగి ప్రారంభం అవుతున్నాయి. ఈ సంవత్సరం ఆఫ్‌లైన్ సేవలను అటవీ శాఖ నిర్వహిస్తుండగా, ఆన్‌లైన్ సేవలను ఫారెస్ట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ)కు అప్పగించారు. ఆన్‌లైన్ సేవల్లో భాగంగా అమ్రాబాద్ టైగర్ స్టే పేరిట కాటేజీలలో బస సౌకర్యం కల్పిస్తారు. పర్యాటక వన మాలికలోని కాటేజీల అప్‌గ్రేడ్ పనులు పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ బుకింగ్ సేవలు ప్రారంభం కానున్నాయి.

### సఫారీ ధరల పెంపు

ఈ ఏడాది టైగర్ సఫారీలో ట్రిప్‌ల వారీగా ధరలను పెంచారు. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూపాయింట్ వరకు వెళ్లి తిరిగి చౌరస్తాకు రావడానికి (18 కి.మీ) రూ.3000 చెల్లించాల్సి ఉంటుంది. మరో ట్రిప్‌లో ఫర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూపాయింట్ మీదుగా గుండం అటవీ మార్గంలో తిరిగి రావడానికి (28 కి.మీ) రూ.5000 రుసుము నిర్ణయించారు. ఒక్కో సఫారీ వాహనంలో ఏడుగురు పర్యాటకులకు అనుమతి ఉంటుంది. వాహనంలో డ్రైవర్‌తో పాటు, ఒక నేచర్ గైడ్ ఉంటారు.

# పనిమనిషి ఫిర్యాదు.. హీరోయిన్ డింపుల్ హాయతీపై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్లో కేసు





హైదరాబాద్,అక్టోబరు 1 (సందేశం టైమ్స్): టాలీవుడ్ హీరోయిన్ డింపుల్ హాయతీ పై ఫిలిం నగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జీతం విషయంలో పని మనిషిపై డింపుల్ హాయతి దూషణలు చేసినట్టు సమాచారం.'నా చెప్పుల విలువ కాదు.. నీ బ్రతుకు' అంటూ.. దూషణలు.. అకారణంగా దాడి చేసినట్టు ఇంట్లో పనిచేసే అమ్మాయి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పని పనిమనిషి ఫిర్యాదుతో హీరోయిన్ డింపుల్ హాయతీ తో పాటు ఆమె భర్త మీద కూడా క్రిమినల్ కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు.

# ఈ నెల 6 నుంచి కాలేజీలు బంద్!

అక్టోబరు 1 (సందేశం టైమ్స్)::తెలంగాణలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు మరోసారి బంద్ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ నెల 6 నుంచి కాలేజీల బంద్ కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ఈరోజు అన్ని ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాల అత్యవసర సమావేశం కానున్నాయి. పెండింగ్ బకాయిలపై కార్యాచరణను ఈ భేటీలో రూపొందించనున్నారు. కాగా ఇటీవల రీయంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15 నుండి నిరవధిక బంధ్ కు కాలేజీల యాజమాన్యాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.కాలేజీలు బంద్ కు పిలుపునివ్వడంతో విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతుందనే నేపథ్యంలో ప్రభుత్వం కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన చర్చలకు సానుకూలంగా స్పందించి బంద్ పిలుపునకు వెనక్కి తగ్గాయి. ప్రభుత్వంతో చర్చల అనంతరం దసరా, దీపావళిలోగా పెండింగ్ లో ఉన్నమొత్తం బకాయిల్లో రూ.600 కోట్లను విడుదల చేయనున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటన చేశారు.అయితే.. ఈ ప్రకటన వెలువడి



రెండు వారాలు గడుస్తున్నా.. ప్రభుత్వం ఇంకా పెండింగ్ బిల్లులను విడుదల చేయలేదు. దీంతో మరోసారి ఆందోళన బాట పట్టేందుకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఫెడరేషన్ అఫ్ అసోసియేషన్స్ అఫ్ తెలంగాణ హైయ్యర్ ఎడ్యుకేషన్స్ ఆధ్వర్యంలో ఇవాళ ఉదయం 11 గంటలకు అత్యవసర మీటింగ్ జరగనుంది. ఈ సమావేశం అనంతరం కాలేజీల బంద్ పై ఒక క్లారిటీ రానుంది. అయితే కాలేజీలు బంద్ అవ్వుతానే ప్రచారంతో తమ పిల్లల చదువుపై ప్రభావం చూపుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# క్రీడావార్తలు




## పీసీబీ ఛీఫ్‌కు కష్టాలు తప్పవా..

## ట్రోఫీ ఇచ్చేందుకు నఖ్వీ కండిషన్ ఏంటంటే..

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ వ్యవహారశైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విజేతగా నిలిచిన టీమ్ ఇండియాకు ట్రోఫీ దక్కకూడదని నఖ్వీ దానిని తనతో పాటు తీసుకుపోవడంపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో పాకిస్తాన్‌ను ఓడించి టీమ్ ఇండియా ఆసియా కప్‌ను గెలుచుకుంది పీసీబీ ఛీఫ్ మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి భారత జట్టు నిరాకరించింది. పాకిస్థాన్ అంతర్గత మంత్రి, భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అయిన నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకూడదని భారత జట్టు భావించింది. దీంతో నఖ్వీ ఆసియా కప్ ట్రోఫీని, మెడల్స్‌ను తనతో పాటు హొటల్‌కు తీసుకెళ్లిపోయారు. ఇప్పటికీ ఆ ట్రోఫీలు, మెడల్స్ నఖ్వీ బస చేస్తున్న హొటల్‌లోనే ఉన్నాయి. నఖ్వీ తీరుపై ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. అలా ట్రోఫీని ప్రైవేట్ ప్లేస్‌కు తీసుకెళ్లే అధికారం నఖ్వీకి లేదని స్పష్టం చేసింది %నవంబర్‌లో దుబాయ్‌లో జరిగే ఆసియా ఏసీసీ సమావేశంలో నఖ్వీని ఏసీసీ అధ్యక్షుడిగా తొలగించాలని బీసీసీఐ పావులు కదుపుతోంది. కాగా, భారత జట్టుకు ట్రోఫీ



ఇచ్చేందుకు నఖ్వీ సిద్ధంగానే ఉన్నారట. అయితే నిర్వాహకులు ఒక కార్యక్రమం ఏర్పాటు చేస్తే, ఆ ట్రోఫీని తన చేతుల మీదుగానే భారత జట్టుకు అందజేస్తానని నఖ్వీ కండిషన్ పెట్టారట. ఈ కండిషన్‌కు బీసీసీఐ అంగీకరించలేదని సమాచారం.

## సుమీత్ హ్యాట్రిక్



న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ఫేవరెట్ సుమీత్ అంటిల్ వరుసగా మూడో పసిడి సాధించగా.. ఎఫ్-44 విభాగంలో సందీప్ సంజయ్ సాగర్, సందీప్ చౌధురి స్వర్ణ, రజతాలు కొల్లగొట్టారు. మంగళవారం జరిగిన పురుషుల ఎఫ్-64 ఫైనల్లో సుమీత్ 71.37 మీ. దూరం విసిరి టాప్‌లో నిలిచాడు. 2023, 2024లో కూడా అంటిల్ పసిడి పతకాలు నెగ్గాడు. పురుషుల ఎఫ్-44 కేటగిరీలో సందీప్ సాగర్ 62.82 మీటర్లు విసిరి టాప్‌లో నిలిచాడు. చౌధురి 62.67 మీటర్ల దూరం విసిరి రజతం దక్కించుకొన్నాడు. పురుషుల ఎఫ్-56 డిస్కస్ త్రోలో యోగేష్ కథూనియా 42.49 మీ. దూరం విసిరి రజతం సాధించాడు. కాగా, తెలంగాణకు చెందిన బానోతు అకీరా నందన్ పురుషుల 400 మీ. టీ38 కేటగిరి హీట్-1లో 50.55 సెకన్ల టైమింగ్‌తో ఫైనల్‌కు అర్హత సాధించాడు.

## కోహ్లీని అనుసరిస్తా




**విరాట్‌తో పోల్చడాన్ని గౌరవంగా భావిస్తున్నా**
**దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించాలనేది కల**
**ఫైనల్లో ప్రత్యర్థులు దారుణంగా స్లెడ్జింగ్ చేశారు**
**ఆరునూరైనా దేశాన్ని గెలిపించాలనుకున్నా**

ఆసియా కప్ ఫైనల్లో కోట్లాది అభిమానుల ఆశలను మోస్తూ బరిలోకి దిగిన తిలక్ వర్మ అద్భుత విజయాన్నందించి భారత్‌ను సమున్నతంగా నిలిపాడు. జట్టును విజయతీరాలకు చేర్చాక అంతులేని ఉద్వేగంతో సింహనాదం చేశాడు. భారత క్రికెట్ నయా చేజ్ మాస్టర్‌గా అభిమానుల నుంచి నీరాజనాలందుకుంటున్న ఆసియా కప్ హీరో, తెలుగు తేజం ఠాకూర్ తిలక్ వర్మ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న విశేషాలు..

అతడి మాటల్లోనే..

2025 సెప్టెంబరు 28.. నా జీవితంలో మర్చిపోలేని రోజు. ఆసియా కప్.. అందులోనూ పాకిస్థాన్‌ను ఓడించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. నా టీ20 కెరీర్‌లోని రెండు సెంచరీల కంటే ఈ ఫైనల్‌లో సాధించిన 69 పరుగులు చాలా ప్రత్యేకమైనవి. జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఇది. ఊహకందని ఒత్తిడి, భారీ అంచనాల నడుమ జరిగిన ఫైనల్లో కడవరకు బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించడం కంటే మధురానుభూతి ఇంకేముంటుంది. ఆసియా కప్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల్లో ఎదురయ్యే సవాళ్లకు మానసికంగా సిద్ధమై ఉన్నాం. 'ఆపరేషన్ సింధూర్' తర్వాత జరుగుతున్న టోర్నీ కావడంతో పాక్‌తో మ్యాచ్‌ల్లో ఉండే పరిస్థితుల గురించి కోచ్ గౌతం గంభీర్ మమ్మల్ని సన్నద్ధం చేశారు. ఫైనల్లో బ్యాటింగ్‌కి రాగానే స్టేడియంలోని ఆ తీవ్రత చూసి కొంచెం ఒత్తిడికి లోనయ్యా. స్వల్ప స్కోరుకే మూడు వికెట్లు కోల్పోవడంతో ఎడాపెడా షాట్లు కొట్టకుండా బాధ్యతగా ఆడాల్సిన పరిస్థితి. ఒక ఓవర్ పూర్తయిన తర్వాత క్రీజులో ఒకసారి కళ్లు మూసుకోగానే 140 కోట్ల మంది ప్రజలు జట్టుపై పెట్టుకున్న ఆశలు, నమ్మకం మదిలో మెదిలాయి. ఒక్కసారి గట్టిగా ఊపిరి తీసుకొని ఆఖరి పరుగు సాధించే వరకు క్రీజు వదలకూడదని అనుకుని పట్టుదలగా ఆడా.

కోహ్లీ అడుగుజాడల్లో నడుస్తా..

2011 వన్డే వరల్డ్‌కప్‌ను టీమిండియా గెలిచిన తర్వాత ఆ స్ఫూర్తితో నేను క్రికెట్ ఆడడం ప్రారంభించా. అప్పటి నుంచి నేను కోహ్లీ ఆట చూస్తూ అతడిని చాలా విషయాల్లో అనుకరించేవాణ్ణి. బ్యాటింగ్‌లోనే కాకుండా మైదానంలోనూ కోహ్లీ చూపించే దూకుడు తాలుకూ ప్రభావం నాపై ఉంది. నా ఆరాధ్యుడైన కోహ్లీతో అభిమానులు నన్ను పోలుస్తుండడం గౌరవంగా భావిస్తున్నా. కానీ కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయడం ఆషామాషీ కాదు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచక్‌పను దేశానికి అందించడమే నా లక్ష్యం. ప్రతి రోజు ఆ ఆలోచనలు నన్ను ప్రేరేపిస్తూనే ఉంటాయి. ఆ ట్రోఫీ సాధించాకే ప్రశాంతంగా నిద్రపోగలను. అప్పటిదాకా నిద్రలో కూడా అవే ఆలోచనలు వస్తుంటాయి. ప్రస్తుతానికి కొద్దిరోజులు కుటుంబంతో గడిపి, తర్వాత ఆస్ట్రేలియా సిరీసకు సన్నద్ధమవుతా.

చెప్పలేని భాషలో పాక్ స్లెడ్జింగ్..

ఆటతోనే కాకుండా ప్రత్యర్థి జట్టు క్రికెటర్లు మమ్మల్ని చాలా కవ్వించారు. చెప్పలేని భాషలో స్లెడ్జింగ్‌కు దిగారు. నా ఏకాగ్రతను దెబ్బతీయడానికి తీవ్రంగా యత్నించారు. మాటలతో మానసికంగా దెబ్బకొట్టి పైచేయి సాధించాలని చూశారు. నేను మాత్రం ఏకాగ్రత కోల్పోకుండా బంతిపైనే దృష్టి పెట్టి బ్యాటింగ్ చేశా. వారి చేష్టలకు, మాటలకు నేను ఆవేశపడి ఒక్క చెత్త షాట్ ఆడినా మ్యాచ్ ఫలితమే తారుమారయ్యే అవకాశం ఉండడంతో సంయమనంతో ఆడా. ఒత్తిడి సమయాల్లో ఎలా ఆడాలో కోచ్ సలాం బయాషీ సార్ వద్ద బాల్యం నుంచి నేర్చుకున్నదాన్ని ఫైనల్లో ఆచరణలో పెట్టా. మనం మూడో వికెట్ కోల్పోయాక పాక్ ఆటగాళ్లు మైదానంలో బాగా రెచ్చిపోయారు. గెలుపు తమదే అన్నట్టు ప్రవర్తించారు. అయినా నేను నా నోటితో కాకుండా బ్యాట్‌తోనే స్పందించా. కోట్లాది భారతీయుల ముఖాల్లో ఆనందం చూడాలని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని ఆడా.

## ఐదు బోర్డుల చెంతకు ట్రోఫీ వివాదం


దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రదానం చేయాల్సిన ట్రోఫీ విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లోనూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోయారు. ఈ సమస్య పరిష్కార బాధ్యతలను ఏసీసీలోని ఐదు టెస్ట్ దేశాలకు వదిలేశారు. దీంతో భారత్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ బోర్డులు చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోనున్నాయి. ఈ వివాదంపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని బీసీసీఐ ఈపాటికే హెచ్చరించింది. ఏసీసీ చీఫ్‌గా ఉన్న మొహిసిన్ నఖ్వీ పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఉండడంతో.. ఆదివారం జరిగిన ఆసియా కప్ ఫైనల్ గెలిచిన



అనంతరం అతడి చేతుల మీదుగా ట్రోఫీని అందుకొనేందుకు భారత్ నిరాకరించింది. దీంతో ట్రోఫీతోపాటు టీమిండియాకు ఇవ్వాల్సిన మెడల్స్‌ను నఖ్వీ తన హొటల్ రూమ్‌కు తరలించినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా, నఖ్వీ అధ్యక్షతన జరిగిన ఏసీసీ ఏజీఎంలో బీసీసీఐ ప్రతినిధులుగా రాజీవ్ శుక్లా, ఆశిష్ షేరల్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

## నెట్స్‌లో చెమటోడ్చిన టీమిండియా

అహ్మదాబాద్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత్.. స్వదేశానికి చేరుకొన్న వెంటనే వెస్టిండీసతో రెండు టెస్టుల సిరీస్ కోసం ప్రాక్టీస్ ఆరంభించింది. మంగళవారం జరిగిన నెట్ సెషన్స్ నుంచి బుమ్రా, కుల్దీప్, అక్షర్ విరామం తీసుకోగా.. మిగతా టీమ్ మూడు గంటలు సాధన చేసింది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిపలో భాగంగా విండీసతో తొలి టెస్ట్ గురువారం నుంచి జరగనుంది. ప్రాక్టీస్ తర్వాత గంభీర్ మరోసారి పిచ్‌ను



పరిశీలించాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో చిత్తయిన నేపథ్యంలో తొలి టెస్ట్ కోసం ఎలాంటి పిచ్‌ను రూపొందించారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో భారత బలానికి తగ్గట్టుగా స్పిన్ వికెట్‌ను తయారు చేసేవారు. మరి గిల్ హయాంలో పాత ఫార్ములాకే కట్టుబడతారా? లేక ప్రయోగాలు చేస్తారా? చూడాలి.

## భారత్ శుభారంభం



గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కపలో తొలి టైటిల్ వేటను భారత్ ఘనంగా ఆరంభించింది. దీప్తి శర్మ ఆల్‌రౌండ్‌షో (53బీ 3/54)తో అదరగొట్టగా మంగళవారం శ్రీలంకతో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 59 రన్స్ తేడాతో నెగ్గింది. ఈ మ్యాచ్‌కు రెండుసార్లు వర్షం ఆటంకం కలిగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 47 ఓవర్లలో 8 వికెట్లకు 269 పరుగులు చేసింది. అమన్‌జోత్ (57), హర్లీన్ (48), ప్రతీకా రావల్ (37), స్నేహ్ రాణా (28 నాటౌట్) రాణించారు. అటు ఫీల్డింగ్‌లో నిరాశపరిచిన లంక అమన్‌జోత్ నాలుగు క్యాచ్‌లను జారవిడిచి మూల్యం చెల్లించుకుంది. స్పిన్నర్ ఇనోక రణవీరకు నాలుగు, ప్రబోధనికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంకకు డ/లూ పద్ధతిన 271 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (43), నీలాక్షి (35), హర్షిత (29) మాత్రమే రాణించారు. స్నేహ్, శ్రీచరణిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దీప్తి శర్మ నిలిచింది.శతక భాగస్వామ్యం: టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగగా నాలుగో ఓవర్‌లోనే మంధాన (8) అవుట్‌తో షాక్ తగిలింది. అయితే హర్లీన్, ప్రతీకా రెండో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. 26వ ఓవర్‌లో హర్లీన్, జెమీమా (0), హర్మన్‌ప్రీత్ (21)లను స్పిన్నర్ రణవీర అవుట్ చేయగా, తర్వాతి ఓవర్‌లోనే రిచా (2) సైతం వెనుదిరిగింది. దీంతో కేవలం నాలుగు పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి 124/6 స్కోరుతో భారత్ కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 200 రన్స్ అసాధ్యంగానే అనిపించింది. కానీ దీప్తి-అమన్‌జోత్ జోడీ లంక బౌలర్లను పట్టుదలగా ఎదుర్కొంది. సమన్వయ ఆటతీరుతో ఇద్దరూ అర్ధసెంచరీలు పూర్తి చేయడంతో పాటు ఏడో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. ఇక స్నేహ్ రాణా ధనాధన్ బ్యాటింగ్‌తో ఆఖరి రెండు ఓవర్లలో 34 పరుగులు సమకూర్చగా భారత్ 260ం స్కోరు దాటింది.

స్కోరుబోర్డుజి

భారత్: ప్రతికా (సి) గుణరత్నే (బి) రణవీర 37, మంధాన (సి) గుణరత్నే (బి) ప్రబోధని 8, హర్లీన్ (సి) దిల్హారి (బి) రణవీర 48, హర్మన్‌ప్రీత్ (సి) సంజీవని (బి) రణవీర 21, జెమీమా (బి) రణవీర 0, దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) కులసూర్య 53, రిచా ఘోష్ (సి) ప్రబోధని (బి) ఆటపట్టు 2, అమన్‌జోత్ (సి) గుణరత్నే (బి) ప్రబోధని 57, స్నేహ్ రాణా (నాటౌట్) 28, ఎక్స్‌ట్రాలు: 15బీ మొత్తం: 47 ఓవర్లలో 269/8బీ

## హిమాన్షు జోడీకి పసిడి



న్యూఢిల్లీ: జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. మంగళవారం జరిగిన పోటీల్లో భారత్‌కు ఓ స్వర్ణం, రజతం, కాంస్యంతో కలిపి మూడు పతకాలు దక్కాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత ద్వయం హిమాన్షు/ఇషా అనిల్ తక్సాలే విజేతగా నిలిచింది. నరేన్/శాంభవి రన్నర్‌పగా నిలవడంతో రజతం భారత్ ఖాతాలో చేరింది. ట్రాప్ ఈవెంట్‌లో వినయ్ చంద్రావత్ కాంస్యం దక్కించుకున్నాడు.

# బిజినెస్



## ఆర్బీఐ రెపోరేట్ జోష్.. లాభాల్లోకి సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

గత ఎనిమిది సెషన్లుగా వరుసగా నష్టాలనే చవిచూస్తున్న దేశీయ సూచీలకు ఆర్బీఐ రెపోరేట్ జోష్ అందించింది. ఆర్బీఐ రెపోరేట్‌ను మరోసారి యథాతథంగా ఉంచుతున్నట్టు ప్రకటించడం మార్కెట్లకు కలిసొచ్చింది. బ్యాంకింగ్ సెక్టార్‌లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు ఆ తర్వాత లాభాల బాట పట్టాయి. ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతన్నాయి. మంగళవారం ముగింపు (80, 267)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి ఎగబాకింది. ఆర్బీఐ వడ్డీ రేట్ల ప్రకటన తర్వాత కనిష్టం నుంచి ఏకంగా 400 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:50 గంటల సమయంలో సెన్సెక్స్ 292 పాయింట్ల లాభంతో 80, 560 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 76 పాయింట్ల లాభంతో 24, 687 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో హడ్కో, లూపిన్, టాటా మోటార్స్, వోడాఫోన్ ఐడియా, ఆర్ఈసీ, ట్రెంట్




మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి  ఆర్బీఎల్ బ్యాంక్, డెలివరీ, ఎస్బీఐ కార్డ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 27 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 374 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.72గా ఉంది.

## బంగారం ధర మరింత పెరిగింది.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 1న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 17, 450కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 07, 660కి చేరింది


నిన్నటితో పోల్చుకుంటే దాదాపు వెయ్యి రూపాయల మేర బంగారం ధర పెరిగింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 17, 600కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 07, 810కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 17, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 07, 660కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## వడ్డీ రేట్లపై  కీలక నిర్ణయం!




సామాన్యులకు మరోసారి ఆర్బీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఈరోజు జరిగిన సమావేశంలో వడ్డీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటు యథాతథంగా ఉంచుతూ ప్రజలకు తీపి కబురు అందించింది. కాగా రెపో రేటు 5.5 శాతం యథాతథంగా ఉండనుంది. అయితే ఆర్బీఐ రేపో రేటులను స్థిరంగా ఉంచండం ఇది రెండో సారి. అయితే.. తాజా ఆర్బీఐ ప్రకటనతో మనం కట్టే %జువీ×%లలో ఎలాంటి మార్పులు ఉండవు.దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే దిశగా ఆర్బీఐ అడుగులు వేస్తోంది. అయితే ఇటీవల అతర్జాతీయంతో పాటు మన దేశంలో నెలకొన్న కొన్ని పరిస్థితుల కారణాలతో ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్ లో జరిగిన సమావేశంలో రేపో రేట్లను 0.25 శాతం చొప్పున తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. జూన్ నెలలో నిర్వహించిన సమావేశంలో ఆర్బీఐ ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కాగా ఇలా వరుసగా మూడు కీలక సమావేశాల్లో ఆర్బీఐ.. రేపో రేటును 1 శాతం మేర తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై విధించిన పన్నుల భారం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు నెలలో రేపో రేటు మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే అక్టోబర్ నెలలో కూడా రేపో రేటును యథాతథంగా ఉంచుతూ ప్రకటన విడుదల చేసింది.

## 6 నెలలురూ.23 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్ మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి వేస్తోంది. సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల కాలంలో బీఎసఈ మార్కెట్ క్యాప్ రూ.23 లక్షల కోట్లు ఆవిరైపోయి రూ.451.6 లక్షల కోట్ల కు చేరింది. అయినా గత ఆరు నెలల్లో సెన్సెక్స్ 4.6%, నిఫ్టీ 3.7% లాభపడ్డాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం తర్వాత సూ చీలు ఇంత కనిష్ఠ లాభాలతో ట్రేడవడం ఇదే మొదటిసారి. ఆ సమయంలో ఈ రెండు ప్రధాన సూచీలు దాదాపు రెండు శాతం వరకు నష్టపోయాయి. అయితే గత ఆరు నెలల్లో నిఫ్టీ మిడ్‌క్యాప్-100, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీలు మాత్రం తొమ్మిది శాతం వరకు లాభాలు పంచాయి.%ఆదుకుంటున్న డీఐఐలు : అంతర్జాతీయ ఉద్రిక్తతలతో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత ఆరు నెలల్లో దాదాపు రూ.37,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. భారత్ కంటే చైనా మార్కెట్ చౌకగా ట్రేడవడం ఇందుకు దోహదం చేస్తోంది. ఎఫ్‌పీఐలు అమ్మకాలు చేస్తుంటే దేశీయ సంస్థలు (డీఐఐ) మాత్రం మార్కెట్‌ను ఆదుకుంటున్నాయి. గత ఆరు నెలల్లో ఈ సంస్థలు దాదాపు రూ.4 లక్షల కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేసినట్టు అంచనా. డీఐఐలు ఆదుకోకపోతే సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలకు లోనయ్యేవి.సత్తా చాటిన రంగాలు: గత ఆరు నెలల్లో ఆటోమొబైల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్ కంపెనీల షేర్ల మాత్రం మదుపరులకు మంచి లాభాలే పంచాయి. ఐటీ, సిమెంట్, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల షేర్లు మాత్రం బేర్‌మంటున్నాయి. ఐటీ ఇండెక్స్ దాదాపు తొమ్మిది శాతం నష్టపోయింది.దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా ఎనిమిదో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 97.32 పాయింట్ల నష్టంతో 80,267.62 వద్ద, నిఫ్టీ 23.80 పాయింట్ల నష్టంతో 24,611 వద్ద ముగిశాయి. గత ఎనిమిది రోజుల్లో సెన్సెక్స్ 2,746.34 పాయింట్లు నష్టపోయింది.

## బంగారం...14 సంవత్సరాల్లో అత్యుత్తమ నెలవారీ వృద్ధి

ముంబై: బంగారం, వెండి ధరలు తగ్గేదేలే అన్నట్టుగా దూసుకుపోతూనే ఉన్నాయి. మంగళవారం బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర మరో రూ.500 పెరిగి రూ.1.20 లక్షలకు చేరింది. ఆభరణాల బంగారం (99.5%) సైతం రూ.500 పెరిగి 1,19,400 పలికింది. కిలో వెండి ధర కూడా రూ.500 పెరిగి రూ.1,50,500 స్థాయిని తాకింది. స్వల్పకాలిక ఫండింగ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో ప్రభుత్వ షట్ డౌన్ తప్పకపోవచ్చునన్న భయాలు ఇన్వెస్టర్ల దృష్టిని ఈక్విటీల నుంచి బులియన్ వైపు ఆకర్షించేందుకు దోహదపడ్డాయి. బంగారం ధరలకు ఇది 14 సంవత్సరాల కాలంలో అత్యుత్తమ నెలవారీ వృద్ధి అని చెబుతున్నారు. సెప్టెంబరు నెలలో బంగారం ధర 11.4% పెరిగింది. 2011 ఆగస్టులో నమోదైన అత్యధిక నెలవారీ వృద్ధి 15% తర్వాత ఒక నెలలో ధర ఈ స్థాయిలో పెరగడం ఇదే ప్రథమం. అయితే అంతర్జాతీయ విపణిలో ధరలు మాత్రం రికార్డు స్థాయిల నుంచి దిగజారాయి. స్పాట్ మార్కెట్లో ఔన్సు బంగారం



ధర 0.55% దిగజారి 3813.14 డాలర్ల వద్ద స్థిరపడింది. వెండి ధర కూడా 1.51% దిగజారి ఔన్సు 46.22 డాలర్లు పలికింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో పసిడి మదుపరులకు మంచి లాభాలు పంచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు పసిడి ధర 23.5 శాతం పెరిగింది.'

## ఎల్‌ఐసీ ఎండీగా ఆర్. చందర్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో డైరెక్టర్లను ఎంపిక చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్ బ్యూరో (ఎఫ్ఎసఐబీ).. జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఏండీ) పదవికి ఆర్. చందర్‌ను సిఫారసు చేసింది. ఈ ప్రతిష్టాత్మక పదవి కోసం మొత్తం ఐదుగురు అభ్యర్థులను బోర్డు ఇంటర్వ్యూ చేయగా, వారి పనితీరు, సమగ్ర అనుభవం, నియామాక ప్రమాణాల ఆధారంగా చందర్‌ను ఎంపిక చేసినట్లు ఎఫ్ఎసఐబీ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామక వ్యవహారాల కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది.యూనియన్ బ్యాంక్ సీఈఓగా ఆశీష్ పాండే: రెండు ప్రభుత్వరంగ బ్యాంకులకు కొత్త సారథులను ప్రభుత్వం నియమించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏండీ, సీఈఓగా ఆశీష్ పాండేను, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధిపతిగా కల్యాణ్ కుమార్‌ను మూడు సంవత్సరాల కాలానికి నియమించింది. పాండే ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పనిచేస్తుండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉన్న కల్యాణ్ కుమార్, జూలైలో పదవీ విరమణ చేసిన ఏం.వీ రావు స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

## అలైడ్ బ్లెండర్స్ పెట్ బాటిల్స్ యూనిట్ ప్రారంభం

: తెలంగాణ వనపర్తి జిల్లాలోని రంగాపూర్ వద్ద ప్రముఖ దేశీయ మద్యం తయారీ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ లిమిటెడ్ (ఏబీడీ) ఏర్పాటు చేసిన పెట్ బాటిల్స్ తయారీ యూనిట్ ఉత్పత్తి ప్రారంభించింది. రూ.115 కోట్ల పెట్టుబడితో ఏటా 60 కోట్ల పెట్ బాటిల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు కంపెనీ ఎండీ అలోక్ గుప్తా చెప్పారు. దీంతో తమ కంపెనీకి చెందిన అన్ని యూనిట్ల పెట్ బాటిల్స్ అవసరాలు తీరతాయన్నారు. రంగాపూర్‌లో కంపెనీ



ఇప్పటికే ఒక డిస్టిలరీ, బాట్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ సమగ్ర యూనిట్‌లో సింగిల్ మాల్ట్ ప్లాంట్ ఏర్పాటు కూడా పూర్తవుతుందన్నారు. దీంతో ప్రపంచంలో ఇదే తొలి సమగ్ర మద్యం తయారీ ప్లాంట్ అవుతుందని గుప్తా చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏబీడీకి అతి పెద్ద మార్కెట్లన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006